నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 31 జనవరి 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

'స్థానిక' ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి



మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి
- మక్తల్‌లో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ కార్యకర్తలు

మక్తల్, జనవరి 30 : త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో బీజేపీ నాయకుడు రాఘవేంద్ర ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే చిట్టెం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అరాచక పాలన సాగిస్తున్నదని, దీనిని వ్యతిరేకించి స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి కాంగ్రెస్‌కు కనువిప్పు కలిగించాలని సూచించారు. పార్టీలోని ప్రతి కార్యకర్త కొత్త, పాత అని తేడా లేకుండా ప్రతిఒక్కరూ కలిసి కట్టుగా పనిచేయాలని, పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన ప్రాతినిధ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చిన్న హనుమంతు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్‌గౌడ్, మాగనూరు మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు రాములు, మొగులప్ప, నాయకులు గాల్‌రెడ్డి, అన్వర్ హుస్సేన్, సురేశ్, మన్నాన్, నర్సింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బాల్‌చెడ్ రాజు, సాగర్, సాధిక్, ఆనంద్, అశోక్‌గౌడ్, బాలప్ప పాల్గొన్నారు.

వేరుశనగకు మద్దతు ధర కల్పించాలి



గద్వాల మార్కెట్‌యార్డులో వేరుశనగను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు విజయ్‌కుమార్

- పల్లీ రైతులను ఆదుకోవాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కుర్వ విజయ్‌కుమార్

గద్వాల, జనవరి 30 : వేరుశనగ పంటకు మద్దతు ధర కల్పించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కుర్వ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లోని పల్లీ రైతులతో బీఆర్ఎస్ గద్వాల నియోజకవర్గ నాయకుడు బాసు హనుమంతుతో కలిసి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో అధిక సంఖ్యలో రైతులు వేరుశనగ పండిస్తారని, పండించిన పంటను మార్కెట్‌కు తీసుకువస్తే మద్దతు ధర లేకుండా అధికార పార్టీ నాయకుల అండదండలతో అధికారులు, వ్యాపారులు రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వేరుశనగకు కనీస మద్దతు ధర రూ.6,783 ఉండగా మార్కెట్‌లో మాత్రం తక్కువ ధరకు తీసుకొని రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు మద్దతు ధర కంటే ఎక్కువ ధర ఇచ్చి రైతులను ఆదుకుందన్నారు. కానీ కాంగ్రెస్ వచ్చినంక పరిస్థితి పూర్తిగా మారిపోయి మార్కెట్ వ్యవస్థ అంతా మళ్లీ దళారుల చేతుల్లో పోయిందని వాపోయారు. మార్కెట్ అధికారులు ఇప్పటికైనా స్పందించి రైతులకు మద్దతు ధర కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, లేనిచో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తాడని హెచ్చరించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుడు హనుమంతు నాయుడు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో రైతులకు ఓవైపు పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక ప్రభుత్వం ఇస్తానన్న రైతు భరోసా ఇవ్వక, రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయక పోవడంతో ప్రస్తుతం రాష్ట్రంలో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. రైతులకు మేలు చేయాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనే విషయాన్ని ముఖ్యమంత్రి గ్రహించి రైతులకు మద్దతు ధర కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని లేని పక్షం రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మోనేష్, శ్రీరాములు, రాజు, ప్రతాప్‌రెడ్డి, దానం, బీచుపల్లి, నర్సింహులు, రాము తదితరులు పాల్గొన్నారు.

భిన్నరుచుల సమ్మేళనంతో 'ఫుడ్ ఫెస్టివల్'

మహబూబ్‌నగర్ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్

- సంప్రదాయ వంటకాలే ఆరోగ్యదాయకం
- ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జనవరి 30 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం భిన్నరుచుల సమ్మేళనంతో 'టేస్టీ ఫుడ్ ఫెస్టివల్-2025' నిర్వహించారు. విద్యార్థినులే స్వయంగా రకరకాల వంటల తోపాటు చిరుతిళ్లను తయారు చేసి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఫెస్టివల్‌లో తెలంగాణ వంటకాలైన పులిహోరా, రాగిజావ, రవ్వలడ్డూ, సున్నుండలు, జొన్న రొట్టెలు, దోసకాయపప్పు వంటి సంప్రదాయ వంటకాలతో పాటు మీట్ అండ్ వెజ్ బాల్‌బిర్యానీ, ఫైనాఫిల్ కేక్, చాక్లెట్ కేక్, పానీపూరీ, చాట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రస్తుత కాలంలో విచ్చలవిడిగా కళ్లకు ఆకట్టుకునే, నోటికి రుచిని అందించే విధంగా ఉండే రంగురంగుల ఆహార పదార్థాలు ఆరోగ్యానికి హానిచేస్తాయంటూ ఏ రకమైన ఆహార పదార్థాలను తింటే శరీరంలోని ఏ అవయవానికి ఉపయోగపడుతుందో విద్యార్థినులు వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సంప్రదాయ వంటకాలే ఆరోగ్యదాయకం అన్నారు. విద్యార్థినులు చదువుతోపాటు వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను ఆహారపదార్థాల ప్రాధాన్యత గురించి తెలియజేయడానికి ఇలాంటి ఫుడ్ ఫెస్టివల్ దోహదపడతాయన్నారు. ఈ ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థినులు తయారు చేసిన వివిధ రకాల వంటకాలను ప్రిన్సిపల్‌తో పాటు న్యాయనిర్ణేతలతో అమీనా ముంతాజ్ జహాన్, ప్రవీణ్‌కుమార్, హరి బాబు తదితరులు రుచి చూసి విజేతలను ప్రకటించారు. ప్రథమ బహుమతి షిరీన్ ఫాతిమా, ద్వితీయ బహుమతి సుమేరా, తస్లీమ్, తృతీయ బహుమతి షబానా, నాజియా, సమ్రూన్, ఐమన్ సాధించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మ, అనురాధ, అమీనాముంతాజ్ జహాన్, మైక్రోబయాలజీ విభాగాధిపతి జే.శ్రీదేవి తదితరులు ఉన్నారు.

విజేతలైన విద్యార్థినులతో కళాశాల అధ్యాపక బృందం

మహబూబ్‌నగర్‌లోని క్లాక్ టవర్ చౌరస్తాలో మూతికి నల్లగుడ్డలు ధరించి నిరసనలో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్ హామీలన్నీ నెరవేర్చాలి

- లేదంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెబుతారు
- రాష్ట్రంలో ఎవరిని కదిలించినా కన్నీళ్లే వస్తున్నాయి..
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- పాలమూరులో గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నేతల వినతిపత్రం
- మూతికి నల్లగుడ్డలతో నిరసన

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 30 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే ముందు ప్రజలకు 420 హామీలు ఇచ్చిందని, తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీలను విస్మరించిందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్‌లో మాజీ మంత్రి బీఆర్ఎస్ నాయకులతో కలిసి మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మూతికి నల్లగుడ్డలు కట్టుకొని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలు ఇచ్చి అధికారం చేపట్టి 420 రోజుల నుంచి ప్రజలను అయోమయానికి గురిచేస్తూ.. ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. రైతులు, సామన్య ప్రజలను ఎవరిని కదిలించిన ఆవేశంగా, ఆవేదనతో వాళ్లభాధలు చెప్పుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కొంత మంది నాయకులు తప్పా రాష్ట్రంలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరని, ఆ పార్టీలో చాలామంది నాయకులు ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని గుర్తుచేశారు. స్థానిక ఎన్నికల్లో ప్రభుత్వం పబ్బం గడుపుకునేందుకు నాలుగు పథకాలకు దరఖాస్తులు తీసుకుంటు, విచారణ పేరుతో ప్రజలను మోసం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దరఖాస్తులు ఎందుకు తీసుకుంటున్నారో.. ప్రభుత్వంలో ఉన్నవాళ్లకూ స్పష్టత లేదని, ముఖ్యమంత్రి ఒక మాట.. మంత్రులు మరో మాట మాట్లాడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెప్పాలన్నారు. 420 హామీలు ఇచ్చిన ప్రభుత్వం.. ప్రధానంగా చెప్పుకుంటున్న ఆరు గ్యారెంటీలు కూడా అమలు చేయలేదని విమర్శించారు. కేసీఆర్ అధ్వర్యంలో తెలంగాణను అన్ని రంగాల్లో ముందు వరసలో నిలిపామని, పదేండ్లల్లో అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసిందని మండిపడ్డారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సిహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, రవీందర్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, నవకాంత్, పెద్దదర్పల్లి పార్టీ అధ్యక్షుడు యాదయ్యగౌడ్, జంబులయ్య తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి వినతుల వెల్లువ

గాంధీ విగ్రహాలకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రాలు పెద్ద ఎత్తున సమర్పించారు. గురువారం ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా కార్యక్రమం జోరుగా కొనసాగింది. మహబూబ్‌నగర్‌లోని క్లాక్ టవర్ వద్ద గాంధీ విగ్రహానికి గులాబీ పార్టీశ్రేణులతో కలిసి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వినతిపత్రం సమర్పించారు. అనంతరం మూతులకు నల్లగుడ్డలు ధరించి నిరసన తెలిపారు. అలాగే మక్తల్‌లో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డితోపాటు నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల, నారాయణపేట, వనపర్తి జిల్లాల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించాలని పలువురు నాయకులు కోరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అసమర్థ, దద్దమ్మ, చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌కు కండ్లు తెరిపించాలని వేడుకున్నారు. మోసపూరిత వాగ్దానాలతో ముఖ్యమంత్రి నిత్యం ప్రజలను వంచిస్తూనే ఉన్నాడని ధ్వజమెత్తారు. గ్యారెంటీల కార్డుకు పాతరేసి అటెన్షన్, డైవర్షన్ డ్రామాలతో కాలం వెళ్లదీస్తున్నాడని ఆగ్రహం చెందారు.

– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, జనవరి 30

- రేవంత్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని బీఆర్ఎస్ శ్రేణుల విజ్ఞప్తి
- ఆయనకు కండ్లు తెరిపించాలి
- కాంగ్రెస్ 420 హామీలు అమలు చేయాలని డిమాండ్
- పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే చిట్టెం, బీఆర్ఎస్ నేతలు

మక్తల్‌లో గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం, బీఆర్ఎస్ నేతలు

అమలు చేయకుంటే ఆందోళనలే..

- అడ్డమైన హామీలతో ప్రజలను మోసం చేస్తున్న సర్కారు
- మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



మక్తల్, జనవరి 30 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 420రోజులు గడుస్తున్నా.. ఆ పార్టీ ఇచ్చిన 420హామీలను నెరవేర్చలేదని, సీఎం రేవంత్‌రెడ్డి చేతగాని పరిపాలన చేస్తున్నాడని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420హామీలను వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో మక్తల్‌లో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు గాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేసి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు పరిచే విధంగా మంచి బుద్ధిని ప్రసాదించమని వేడుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి దేశాన్ని పరిపాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క రోజు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. అదే తరహాలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు 420 హామీలు ఇచ్చినా ఇందులో ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం అడ్డమైన హామీలు ఇచ్చి తీరా మోసం చేస్తున్నదని ఆయన దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజల తరపున బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేత శ్రీనివాస్‌గుప్తా, మండల పార్టీ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి, పట్టణ అధ్యక్షుడు హనుమంతు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు రాములు, మొగులప్ప, నాయకులు గాల్‌రెడ్డి, అన్వర్‌హుస్సేన్, వెంకటయ్యగౌడ్, ప్రతాప్‌రెడ్డి, మారుతీగౌడ్, రామలింగం, మన్నాన్, మహిమూద్, అశోక్‌రెడ్డి, జయానంద్, రాజు, సాగర్, ఆనంద్, రాజు, అశోక్ గౌడ్, బాలప్ప, ఆంజనేయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం మోసం చేసింది

కాంగ్రెస్ ప్రభుత్వం మావద్ద ఓట్లు దండుకొని రైతులను మోసం చేస్తుందని హన్వాడ మండలానికి చెందిన పాడి రైతు రవి తన ఆవేదన వ్యక్తం చేశారు. విజయ డెయిరీకి ప్రతి రోజూ పాలు పోస్తున్నామని.. 15 రోజుల కోసారి బిల్లు చెల్లించాల్సిన ప్రభుత్వం ఐదు నెలలు గడుస్తున్నా పాల డబ్బులు కూడా అందించడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు సబ్సిడీతో ఎరువులు, పశువుల దాణా ఇచ్చేవారన్నారు. ఆదివారం మీ ఖాతాలో రైతు భరోసా పడుతుందని సీఎం చెప్పినా నేటి వరకు ఒక్క రుపాయి కూడా పడలేదన్నారు.

- రవి, పాడి రైతు

రెండ్నెళ్లుగా పింఛన్ రాలే..

కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండు నెలల నుంచి తనకు పింఛన్ అందడం లేదు. కేసీఆర్ ప్రభుత్వంలో అడక్కుండానే నెలకు రూ.రెండు వేల పింఛన్ వస్తుండే.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత తన పెన్షన్ అగిపోయిందంటూ అధికారుల వద్దకు వెళ్తే తమకు తెలియదంటు దాటవేస్తున్నారని, తన బాధలు చెప్పుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై శాపనార్థాలు పెటింది.

- నీలమ్మ, గృహిణి

అన్నీ ఇచ్చిన దేవుడు కేసీఆర్

కేసీఆర్ దేవుడని ఆయన ఉన్నప్పుడు అడగక ముందే అన్ని పథకాలు అమలు చేశారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో హన్వాడకు చెందిన ఓ వృద్ధుడు గురువారం మహబూబ్‌నగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం సందర్భంగా అన్నారు. కాంగ్రెసోళ్లు ఎన్నికల ముందు అన్ని పెంచి ఇస్తామని అన్నారు. ఈ ప్రభుత్వం కనీసం వృద్ధులకు పింఛన్ కూడా పెంచడం లేదు. నెలనెలా సక్రమంగా పింఛనే ఇవ్వడం లేదు. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని మాయమాటలు చెప్పి ప్రజలను వంచించాడని మండిపడ్డారు.

సర్వేను అడ్డుకొంటున్నారని..

- తల్లీ కొడుకు ఆత్మహత్యాయత్నం
- అడ్డు తగిలిన పక్క పొలాల రైతులు
- పోలీసుల సహకారంతో సర్వే పూర్తి
- రాయాపురం శివారులో ఘటన

సర్వే చేపట్టాలని వేడుకుంటున్న తల్లీకొడుకులు

గట్టు, జనవరి 30 : తమ పొలాన్ని సర్వే చేయకుండా అడ్డుకొంటున్నారని మనస్తాపం చెందిన తల్లీ కొడుకు ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో చోటు చేసుకున్నది. వివరాలిలా.. గట్టు మండలం పెంచికలపాడుకు చెందిన తల్లీ కొడుకు ఉమామహేశ్వరికి 3 ఎకరాల 9 గుంటలు, ఆమె తల్లి మణెమ్మకు 3 ఎకరాల 35 గుంటల చొప్పున సమీపంలోని రాయపురం గ్రామ శివారులోని సర్వే నెంబర్ 83/38, 83/39లో 7 ఎకరాల నాలుగు గుంటల గైరాన్ భూమి ఉన్నది. అయితే వారు గ్రామంలో కాకుండా ఇతర ప్రాంతంలో ఉంటున్నారు. దీంతో రాయపురం గ్రామానికి చెందిన రైతులు కొంత మేర కబ్జా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పొలాన్ని సర్వే చేయాలని ఉమామహేశ్వరి, ఆమె కొడుకు రఘువంశీ రెవెన్యూ అధికారులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సర్వేయర్, సిబ్బంది పొలం వద్దకు వచ్చారు. ఈ విషయం తెలుసుకొన్న సమీప పొలాల రైతులు అక్కడికి చేరుకొని సర్వేను అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో మనస్తాపంతో చెందిన తల్లీ కొడుకులు వారి వెంటన తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకున్నారు. వెంటనే అప్రమత్తమైన అక్కడున్న వాళ్లు వారి ప్రయత్నాన్ని అడ్డుకొన్నారు. అయినా వారు ఎంత చెప్పినా వినిపించుకోలేదు. అక్కడున్న వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకొని వారికి నచ్చజెప్పారు. తమ పొలాన్ని సర్వే చేయాలని అధికారులను కోరితే పక్క పొలాల రైతులు అడ్డుకొంటున్నారని వారు వాపోయారు. వారికి రాజకీయ సహకారం ఉండడంతో మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పొలం సర్వే చేయడానికి పోలీసుల సహకారం కూడా తీసుకున్నామని, అయితే అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. అనంతరం పోలీసుల సహకారంతో పొలాన్ని అధికారులు సర్వే చేశారు.

ఫిబ్రవరి 1న కేటీఆర్ రాక

- మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

గండీడ్, జనవరి 30 : పరిగి నియోజకవర్గంలోని కుల్కచర్ల మండలం దాసానాయక్‌తండాలో ఫిబ్రవరి 1న నిర్వహించే సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్నట్లు పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తెలిపారు. గురువారం గండీడ్ మండలకేంద్రంలో ఉమ్మడి మండల బీఆర్ఎస్ నాయకులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాపాలన గాడి తప్పిందని, ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఈ రోజు ఏవిధమైన సమాధానం చెబుతుందన్నారు. రైతు ప్రభుత్వం అంటూ రైతుల నడ్డి విరుస్తుందని స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నాలుగు పథకాలను ప్రారంభించి ప్రజలను మచ్చిక చేసుకునేందుకు కుట్రలు చేసింది తప్పా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. జనవరి 27 తెల్లారేసరికి అందరి ఖాతాలో రైతు భరోసా వేస్తామని చెప్పి తెల్లారేసరికి మాటమార్చి 2025 మార్చి 30 వరకు పొడిగించి మరోసారి తెలంగాణ ప్రజలను మోసం చేయడం తప్పా మరోటి కాదన్నారు. శనివారం దాసానాయక్ తండాలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్న నేపథ్యంలో నిర్వహించే సమావేశానికి గ్రామస్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి మండల అధ్యక్షుడు పెంట్యానాయక్, భిక్షపతి, ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన టీచర్

- పాఠశాల యాజమాన్యంపై ఫిర్యాదు



వీపుపై వాతలు చూపిస్తున్న విద్యార్థి

అయిజ, జనవరి 30 : పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థిపై తరగతి ఉపాధ్యాయురాలు వీపుపై చితకబాది గాయపర్చిన ఘటన చోటు చేసుకున్నది. తల్లిదండ్రులు, పోలీసుల కథనం మేరకు.. గట్టులో నివాసం ఉంటున్న జ్యోతి (గట్టులోని టీజీఎస్‌డబ్ల్యూఎస్‌లో పీడీ), కృష్ణానాయక్ దంపతులు ఇద్దరు కుమారులు విరాట్ శంకర్‌నాయక్, మోక్షిత్ నాయక్ అయిజ పట్టణంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు. విరాట్ శంకర్ నాయక్‌ను తరగతి ఉపాధ్యాయురాలు కట్టెతో చితక బాదడంతో వీపుపై గాయమైంది. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు విద్యార్థిని చితకబాదిన విషయం హెచ్ఎంతో ఫోన్‌లో మాట్లాడగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని తల్లిదండ్రులు వాపోయారు. విద్యార్థులను కొట్టే హక్కు ఉపాధ్యాయురాలుకు లేదని చెప్పినా ఎక్కడైనా చెప్పుకోండని సమాధానం ఇవ్వడంతోనే గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తల్లిదండ్రులు జ్యోతి, కృష్ణానాయక్ తెలిపారు. ఇదే విషయమై పాఠశాల ఆవరణలో బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ఉపాధ్యాయులు విద్యార్థులను చితక బాదేలని, వేలకు వేలు ఫీజులు కట్టి విద్యాబోధన చేయాలని తల్లిదండ్రులు కోరగా, పిల్లలను కట్టెలతో కొట్టడం ఏమిటని ప్రశ్నించారు. పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఎంఈవో రాములు, హెచ్ఎం మధుసూధన్‌రెడ్డితో వాగ్వివాదానికి దిగారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాథమిక విచారణ చేసి, ఉన్నతాధికారులకు పంపుతామని ఎంఈవో చెప్పారు. ఉపాధ్యాయురాలు విద్యార్థిని చితకబాదడం తప్పేనని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని హెచ్ఎం తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నామని కానిస్టేబుల్ తెలిపారు.